క్లుప్తంగా

ప్రశాంతంగా ఎన్ఎంఎస్ పరీక్ష

ఆత్మకూరు: పట్టణంలోని పలు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన నేషనల్ మెరిట్స్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 155 మందికి గానూ 150 మంది హాజరైనట్లు పరీక్షల చీఫ్ పీ పుల్లయ్య, డీఓటీ శ్రీనివాసులు తెలిపారు. సెంట్‌మేరీస్ పాఠశాలలో 188 మంది హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు ఏ వెంకటేశ్వర్లు, రమణయ్య చెప్పారు. బైపాస్‌రోడ్‌లోని రెసిడెన్సియల్ పాఠశాలలో 184 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు ఐ రజిత, పీ వెంకటేశ్వర్లురెడ్డి వివరించారు.

బైక్ దహనం

నెల్లూరు(క్రైమ్): ఇంటి పక్కన నిలిపి ఉంచిన బైక్‌ను గుర్తుతెలియని దుండగులు దహనం చేసిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొండదిబ్బలోని మహాలక్ష్మమ్మ ఆలయ సమీపంలోని ప్రాంతంలో రఫీ నివాసం ఉంటున్నారు. తన బైక్‌ను గుడి పక్కన శనివారం నిలిపారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు బైక్‌కు నిప్పంటించారు. దీంతో బైక్ పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిక్షా పుల్లర్ మృతి

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని రిక్షా పుల్లర్ (60) మృతి చెందిన ఘటన రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో నాలుగేళ్లుగా రిక్షా నడుపుకొని రాత్రి వేళ అదే రిక్షాలో సదరు వ్యక్తి నిద్రించేవారు. ఈ క్రమంలో నెల్లూరు రైల్వేస్టేషన్ పడమర వైపున తన రిక్షాలోనే ఆయన మృతి చెందారు. గమనించిన స్థానికులు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజేష్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. స్థానిక వీఆర్వో శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సంతపేట పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): పెళ్లి చేసుకుంటానని బాలికను నమ్మించిన ఘటనలో నిందితుడ్ని చిన్నబజార్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉంటున్న లక్ష్మి కుమార్తెను అదే ప్రాంతానికి చెందిన షరీఫ్ పెళ్లి పేరిట నమ్మించి మోసగించారు. ఈ మేరకు చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబుకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు నిందితుడిపై పోక్సో కేసును ఎస్సై లతీఫున్నీసా నమోదు చేశారు. నిందితుడ్ని అతని ఇంటి వద్దే అరెస్ట్ చేశారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యమైన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కాకర్లవారి వీధికి చెందిన ఓ మహిళ తన భర్తను, పిల్లలను వదిలేసి ఇంటి నుంచి శనివారం వెళ్లిపోయారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు భర్త ఫిర్యాదు చేశారు.

దాడి కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): దాడి చేస్తుండగా అడ్డుకున్నారనే అక్కసుతో మహిళపై కొందరు దాడికి పాల్పడిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇందిరమ్మ కాలనీకి చెందిన అనిత మినీబైపాస్‌లోని అనిల్ గార్డెన్స్ సమీపంలో చేపల వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వరుసకు కుమారుడు శ్రీరామ్ ఆమెతో పాటు వ్యాపారం చేస్తున్నారు. పాత గొడవలను మనస్సులో పెట్టుకొని కొండాయపాళేనికి చెందిన ప్రవీణ్ తన అనుచరులతో వచ్చి శ్రీరామ్‌పై దాడి చేస్తుండగా అనిత అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన నిందితులు ఆమెపై సైతం దాడి చేశారు. గాయపడిన ఆమె జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేరారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నెల్లూరు(బృందావనం): మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేద పండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా సాయికుమార్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

నేటి నుంచి సంగీత, నృత్య మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఎస్పీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో యువజన సంగీత, నృత్య మహోత్సవాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల పదివరకు నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ సాయిబాబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం 4.30 నుంచి 6.30 వరకు గాత్రకచేరి, నృత్య ప్రదర్శనలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్



ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల సారథి అనిఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మర్రిపాడు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మూడోరోజైన ఆదివారం ఆయన కొనసాగించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి మాట్లాడుతూ జగనన్న రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు ఇంటిముంగిటే అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న జగనన్నకు అండగా నిలిచి రాబోయే ఎన్నికల్లో మరోమారు సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. ఎంపీటీసీ ముడి మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దేవసహాయం, వైఎస్సార్‌సీపీ నేతలు కంటాబత్తిన రఘునాథరెడ్డి, మెట్టుకూరు వాసుదేవరెడ్డి, రావుల ప్రసాద్‌గౌడ్, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి

కావలి : పట్టణంలోని పాతవూరు మున్సిపల్ పాఠశాలలో అదనపు తరగతుల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణి రామిరెడ్డి ఆదిలక్ష్మి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తోందన్నారు. జగనన్న అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, గోరుముద్ద, తదితర పథకాల ద్వారా పేద విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు. నాడు–నేడు రెండో విడత కింద రూ.2 కోట్లతో అదనపు తరగతుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యాదవ ప్రముఖుల ఆత్మీయ కలయిక



ఆత్మకూరు: పట్టణంలోని ఏఎస్ఆర్ కళాశాల ఆవరణలో యాదవ ప్రముఖుల ఆత్మీయ కలయికను ఆదివారం నిర్వహించారు. అఖిల భారత యాదవ మహాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన యాదవ ప్రముఖులు పాల్గొన్నారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్లను యాదవులు సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ఉన్నత చదువులు చదివి ఉజ్వల భవిష్యత్ నిర్మించుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. యాదవ సంఘ జిల్లా కార్యవర్గ సభ్యులు వీ లలితారామ్, కే మధుబాబు, పీ గోపాల్, పద్మజ, లక్ష్మి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల రవాణాకు రైతుల అవస్థ



బంట్లపల్లి సమీపంలో పొగాకు తోటల నడుమ గుంతలమయమైన రోడ్డు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లి నుంచి బంట్లపల్లి, ఖాన్‌సాహెబ్‌పేట, డీసీపల్లి మీదుగా 67వ నంబరు జాతీయ రహదారికి రాకపోకలు సాగించే రోడ్డు గుంతలమయంగా తయారవడంతో ప్రయాణికులతో పాటు రైతులు అవస్థ పడుతున్నారు. ముఖ్యంగా పొగాకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. డీసీపల్లి వేలం కేంద్రం పరిధిలోని రామస్వామిపల్లి క్లస్టర్‌లో 300 పొగాకు బ్యారెన్లు ఉన్నాయి. సుమారు రెండు వేల ఎకరాల్లో రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పొగాకు క్యూరింగ్ పూర్తి చేసి గ్రేడింగ్‌లు నిర్వహిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో డీసీపల్లి వేలం కేంద్రంలో పొగాకు వేలం ప్రక్రియను ప్రారంభించనున్నారు. పొగాకు రైతులు తమ ఉత్పత్తులను వేలానికి రామస్వామిపల్లి–డీసీపల్లి రోడ్డు మార్గంలోనే ట్రాక్టర్లతో తరలించాల్సి ఉంది. గత రెండేళ్లుగా ఉత్తరకాలువ లైనింగ్ పనులకు కంకర, ఇసుక, సిమెంట్ తరలించే టిప్పర్లు, లారీలు వందల సంఖ్యలో తిరగడంతో సుమారు 8 కిలోమీటర్ల దూరం ఉన్న రామస్వామిపల్లి రోడ్డు పూర్తిగా ఛిద్రమైపోయింది. పంచాయతీరాజ్, పీఐయూ విభాగం అధికారులు రామస్వామిపల్లి నుంచి 67వ నంబరు జాతీయ రహదారిని కలుపుతూ ఆత్మకూరు మండలం వెన్నవాడ–గండ్లవేడు మధ్యనున్న బొగ్గేరుపై కల్వర్టు నిర్మిస్తామని, అక్కడి నుంచి వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు రామస్వామిపల్లి రోడ్డును పునర్నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారు. కానీ ఇంత వరకు రోడ్డు నిర్మాణ పనులు కార్యరూపం దాల్చలేదని రైతులు, ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

బ్రాహ్మణ సేవా సంఘ వ్యవస్థాపక దినోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): బ్రాహ్మణ సేవా సంఘ బాలాజీనగర్ శాఖ వ్యవస్థాపక దినోత్సవాన్ని కురువాడ లలితమ్మ కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం నిర్వహించనున్నామని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణమూర్తి, కాంతారావు ఆదివారం తెలిపారు. పలువుర్ని సత్కరించనున్నా మని చెప్పారు. కార్యక్రమానికి భారీగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

గంజాయి విక్రేత పట్టివేత

ఆత్మకూరు:పట్టణంలోని జ్యోతినగర్‌లో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో సెబ్ సీఐ బీ నయనతార ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆదర్శ్ అనే యువకుడు తన ఇంటి వద్దే గంజాయిని చిన్న పొట్లాల్లో విక్రయిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని కోర్టుకు హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

రంగడికి బంగారు గరుడసేవ



నెల్లూరు(బృందావనం): వ్యాస పౌర్ణమిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బంగారు గరుడసేవను నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

అచ్చమాంబకు పొంగళ్లు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాళ్ల ఆలయం వద్ద ఆదివారం భక్తులు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం భజనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



కావలి: పట్టణంలోని డాక్టర్ రామస్వామి ఆస్పత్రిలో నెల్లూరుకు చెందిన డాక్టర్ హేమలతారెడ్డి న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. న్యూరోఫిజీషియన్ డాక్టర్ హేమలతారెడ్డి మూర్ఛ, పార్కిన్‌సన్స్, పక్షవాతం, నరాల వ్యాధులతో బాధపడుతున్న రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నరాల సంబంధిత రోగులకు అవగాహన కల్పించారు. ప్రతినెలా కావలిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువుల దాణా పంపిణీ



సోమశిల: అనంతసాగరం మండలం పాతళపల్లిలో స్వేచ్ఛ సొసైటీ ఆధ్వర్యంలో పాడి రైతులకు ఆదివారం పశువుల దాణాను పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ చైతన్య కిరణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎన్జీఓ కానగల వెంకటరమణయ్య తెలిపారు. సొసైటీ సేవా కార్యక్రమాలను జిల్లా నుండి ప్రారంభించడం సంతోషకరమన్నారు. పాతాళపల్లి మాజీ సర్పంచ్ చల్లా సంపూర్ణమ్మ, అనంతసాగరం సొసైటీ మాజీ డైరెక్టర్ చల్లా వెంకటరమణారెడ్డి, స్వేచ్ఛ సొసైటీ మండల కన్వీనర్ బొజ్జా మోషే, తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ వైద్యశిబిరం



ఆత్మకూరు: జనవిజ్ఞాన వేదిక ఆత్మకూరు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని షిర్డీ సాయిరాం కళాశాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన ప్రజావైద్యశాల వైద్యులు రమణయ్య, అనూష బీపీ, షుగర్‌తో బాధపడుతున్న రోగులకు పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులను అతితక్కువ ధరకే అందజేశారు. జేవీవీ,సీపీఎం నాయకులు హరికృష్ణ, ఎస్‌కే సందానీ, లక్కు ప్రసాద్, మురళీ, డేవిడ్‌రాజు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడులు



ఆత్మకూరు: మండలంలోని మహిమలూరు గ్రామ శివారు పొలాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై ఎం శివశంకర్‌రావు తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.2,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరిస్తున్న దంపతులు



విశేషాలంకారంలో సత్యనారాయణస్వామి

సంగం: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రమాదేవి సమేత సత్యనారాయణస్వామి ఉత్సవమూర్తులను వేద పండితులు విశేషంగా అలంకరించి సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన దంపతులు సంప్రదాయ దుస్తులతో హాజరై వ్రతాన్ని ఆచరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

జగనన్న నమ్మకాన్ని నిలబెట్టాలి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చేందుకు నియమించిన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు జగనన్న నమ్మకాన్ని నిలబెట్టాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. చేజర్ల మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు సింగసాని గురుమోహన్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. అర్హులందరికీ సకాలంలో సంక్షేమ ఫలాలు అందించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు గురుమోహన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చాడన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి గృహసారథులు కృషి చేయాలన్నారు. వలంటీర్‌కు ఇద్దరు గృహసారథులు ఉంటారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు జగనన్న బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నారన్నారు. తొలుత మండల సచివాలయాల కన్వీనర్‌గా పూనూరు బాలంగాధర్ రెడ్డిని నియమించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పూనూరు రామమనోహర్‌రెడ్డి, మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బీ వీరరాఘవరెడ్డి, చేజర్ల సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మురగళ్లలో ఉచిత మెగా వైద్యశిబిరం



ఆత్మకూరురూరల్: మండలంలోని మురగళ్లలో చెన్నైకు చెందిన గ్లోబల్ ఆస్పత్రి, ఆత్మకూరుకు చెందిన శ్రీవెంకటేశ్వర ప్రజావైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి స్పందన లభించింది. గ్లోబల్ ఆస్పత్రి వైద్యుడు రజనీకాంత్, ఆత్మకూరు ఎస్వీపీ వైద్యశాల అధినేత డాక్టర్ ఏ ప్రణీత్ ఆధ్వర్యంలో 20 మంది వైద్యులు రెండు వేల మందికిపైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రముఖ గైనకాలజిస్ట్ హారిక వైద్యశిబిరం ఏర్పాట్లను పరిశీలించారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో వ్యాక్సిన్లు

కలిగిరి: రైతుభరోసా కేంద్రాల్లో పశువుల వ్యాధులకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని పెద్దకొండూరు పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులకు వచ్చే గొంతువాపు వ్యాధి, కోళ్లకు వచ్చే అమ్మవారు, తెగుళ్ల నివారణకు వెటర్నరీ అసిస్టెంట్లను సంప్రదిస్తే వ్యాక్సిన్లు వేస్తారన్నారు. పశువులకు అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నంబర్ 1962కు సమాచారం ఇస్తే పశుఅంబులెన్స్ వచ్చి వైద్య సేవలు అందిస్తుందన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా పాడిరైతులకు రాయితీపై దాణా, పశుగ్రాసం పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సును ఢీకొన్న లారీ–ఒకరికి గాయాలు



మర్రిపాడు: మండలంలోని పొంగూరుకండ్రిక సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం బస్సు–లారీ ఢీకొన్న ప్రమాదంలో లారీడ్రైవర్ గాయపడ్డాడు. వివరాలు..వాకాడు డిపోకు చెందిన బస్సు కడప నుంచి నెల్లూరు వైపు 33 మంది ప్రయాణికులతో ఆదివారం వేకువన బయలుదేరింది. బస్సు పొంగూరుకండ్రిక సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కకు తిప్పడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో లారీడ్రైవర్ గాయపడగా, 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పొగమంచు కారణంగా ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. బస్సు డ్రైవర్ అప్రమత్తతో పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

మాలకొండారెడ్డి సామాజిక సేవలు అభినందనీయం



కేంద్ర ప్రభుత్వ జ్ఞాపికను అందుకుంటున్న మాలకొండారెడ్డి

కావలి రూరల్ : ప్రస్తుత సమాజంలో సామాజిక సేవ చేస్తూ, సంఘాన్ని మేల్కొల్పుతున్న సామాజిక కార్యకర్త ఎం మాలకొండారెడ్డి సేవలు అభినందనీయమని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాధవి పేర్కొన్నారు. గుడ్లూరు ఉన్నత పాఠశాలలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార విభాగం ఆధ్వర్యంలో పరాక్రమ దివాస్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండారెడ్డికి కేంద్ర ప్రభుత్వ జ్ఞాపికను ప్రదానం చేశారు. విద్యార్థి దశ నుంచి సామాజిక స్పృహతో ప్రజలను చైతన్యపరుస్తూ సామాజిక రుగ్మతలపై పోరాడుతుండడంపై అభినందించారు.

గిరిజన ఉద్యోగులకు సన్మానం



నెల్లూరు(వేదాయపాళెం): గిరిజన ఉద్యోగులకు రిజర్వేషన్‌ను పది శాతానికి పెంచాలని యానాది గిరిజన ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కేశవరామ్ కోరారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్న గిరిజన ఉద్యోగులకు అభినందన సభను సుబేదారుపేటలోని వెన్నెలకంటి రాఘవ య్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. అనంతరం గిరిజన ఉద్యోగులను సత్కరించారు. ఉద్యోగ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్బారావు, చెంచయ్య, రాజమౌళి, మురళి, రవీంద్ర, యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య, వెంకటేశ్వర్లు, ఉషా, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.